# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 131 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 8 జనవరి 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## కేరళలో అయ్యప్పల కారుకు ప్రమాదం

### ప్రమాదంలో హైదరాబాద్ వాసి దుర్మరణం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే ఉదయం)

శబరిమల యాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న భక్తుల వాహనం కేరళలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన ఉద్యోగి అశోక్ మృతి చెందారు, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ప్రమాదం బుధవారం ఉదయం 5:30 గంటలకు మువత్తుపుళ్ పెరుంబవూర్ రోడ్డులోని త్రిక్కలత్తూర్, కవుంపాడు వద్ద జరిగింది. భక్తులు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు, ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడ్డవారిలో కొడుకు, అల్లుడు తీవ్రంగా గాయపడ్డారు. అల్లుడు ఆరోగ్యం అత్యంత విషమంగా ఉంది. గాయపడినవారిని స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు..

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు

# లైన్ క్లియర్

### అధికారులను సన్నద్ధం చేసిన కమిషనర్

### కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

### ఓటర్ల జాబితాల సవరణ, అభ్యంతరాలపై షెడ్యూల్




హైదరాబాద్, జనవరి 7 (నమస్తే ఉదయం)

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. తెలంగాణ శాసనసభలో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. 2019 మున్సిపల్ చట్టంలో కీలక మార్పు చేస్తూ బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఓటర్ల జాబితా సవరణకు 60 రోజుల ముందే సమాచారం ఇవ్వాలన్న నిబంధన తొలగించారు. దీంతో భారత ఎన్నికల సంఘానికి ముందస్తు సమాచారం అవసరం ఇక లేదు. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభం కాగా, ఈ నెల 10న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. చట్ట సవరణతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వానికి పూర్తి వెసులుబాటు వచ్చింది. కాగా, మున్సిపల్ ఎన్నికల దిశలో అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఈ నెలలోనే ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని, ఫిబ్రవరిలో ఈ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంక్రాంతికి ముందు లేదంటే ఆ తర్వాత కచ్చితంగా షెడ్యూల్ ప్రకటించి ఆ వెనువెంటనే నోటిఫికేషన్ ఇవ్వడానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ..మిగతా 2లో



## నెతన్యాహుకు

# ప్రధాని మోదీ ఫోన్

### ఉగ్రవాదంపై పోరు, ప్రాంతీయ పరిస్థితులపై చర్చలు

### భారత్, ఇజ్రాయెల్ సంబంధాల గురించి చర్చలు

### నెతన్యాహు, ఇజ్రాయెల్ వాసులకు

### న్యూ ఇయర్ విషెస్ చెప్పిన భారత ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 7 (నమస్తే ఉదయం)

ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో నెతన్యాహు, ఇజ్రాయెల్ దేశ ప్రజలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇద్దరు నాయకులు కూడా తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

“నా స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్ లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో భారత్–ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం గురించి మేము చర్చించాం. ప్రాంతీయ పరిస్థితులపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నాం. ఉగ్రవాదాన్ని మరింత దృఢ సంకల్పంతో ఎదుర్కోవాలనే మా ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాం.” అని మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.



## ముగ్గురు మంత్రులు..

## 30 శాతం కమీషన్లు

# వసూలు

### కేటీఆర్

ఖమ్మం, జనవరి 7 (నమస్తే ఉదయం)

ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు 30శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఖమ్మం నిర్వహించిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో జరిగిన సర్పంచి ఎన్నికల్లో.. రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం సర్పంచ్‌లను బీఆర్ఎస్ గెలుచుకుందన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్పించే పనిలో ఉన్నారని విమర్శించారు.

# ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మళ్లీ షాక్



## కాంగ్రెస్‌లోకి

## మరో ముగ్గురు కార్పొరేటర్లు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే ఉదయం)

ఖమ్మం నగరపాలక సంస్థలో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా.. బుధవారం మరో ముగ్గురు చేరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లలో ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి ఉన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి హస్తం పార్టీకి వచ్చిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మ, జి.చంద్రకళ, డి.సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టుల

# లొంగుబాటు

చర్ల, జనవరి 7 (నమస్తే ఉదయం)

ఛత్తీస్‌గఢ్‌లో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట బుధవారం సరెండర్ అయ్యారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 13 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్, సౌత్ బస్తర్ డివిజన్, మడ్ డివిజన్, ఆంధ్రా–ఒడిశా డివిజన్‌కు చెందిన మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారని ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. అబూజ్‌మడ్, సుక్మా, ఒడిశా సరిహద్దుల్లో జరిగిన పలు హింసాత్మక ఘటనల్లో వీరి పాత్ర ఉందని పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు.



# ఐ బొమ్మ రవికి షాక్

### కోర్టులో చుక్కెదురు

### ఐదు కేసుల్లో

### బెయిల్‌ను తిరస్కరించిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే ఉదయం)

పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అతడి బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని రవి కోర్టును ఆశ్రయించాడు. కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అతడికి విదేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే దేశం దాటి వెళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఇటీవల నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్లపై ..మిగతా 2లో

## 13 నుంచి 17 వరకు

# కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్



### సంక్రాంతి సందర్భంగా కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

### అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్

### ప్రపంచ పర్యాటకంగా తెలంగాణ అభివృద్ధి

### అధికారులతో కలసి సమీక్షించిన మంత్రి జూపల్లి

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే ఉదయం)

ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ప్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని ..మిగతా 2లో



# పశ్చిమ దేశాల కపటత్వం

### ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉచిత సలహాలు

### అవేవీ పట్టించుకోకుండా భారత్ భద్రతపై దృష్టి

### విదేశాంగమంత్రి జైశంకర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, జనవరి 7 (నమస్తే ఉదయం)

పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. ..మిగతా 2లో

# 13 నుంచి 17 వరకు
# కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

మొదటి పేజీ తరువాయి

15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పర్యాటకం అంటే కేవలం వినోదం కాదు, ఇది రాష్ట్ర ఆర్థిక రంగానికి చుక్కాని. ఇది ప్రత్యక్షంగా, పరోక్షంగా వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తూ రెవెన్యూను, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తుంది. పర్యాటకం ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ రంగాలను ప్రభావితం చేస్తుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు అవకాశమిస్తుంది. ప్రపంచాన్ని కొత్తగా చూడటం ఎలాగో నేర్పుతుంది. హోటళ్లు, రవాణా, రిటైల్ షాపులు దీనివల్ల భారీగా లబ్ధి పొందుతాయి. అంతేకాదు.'క్రాస్ కల్చరల్ ఇంటరాక్షన్'- అంటే వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు, నేపథ్యాలు ఉన్నవారి మధ్య బంధం బలపడేలా చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసే రహదారులు, ఎయిర్‌పోర్టులు, తాగునీరు, పారిశుద్ధ్య సేవల అభివృద్ధి స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది. నూతన పర్యాటక విధానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త సమతుల్య అభివృద్ధి కోసం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను గుర్తించాం అని జూపల్లి అన్నారు. టూరిజం కాంక్లేవ్, గ్లోబల్ సమ్మిట్ ద్వారా 22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా సుమారు 90,000 ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో 19.44 మీటర్ల అతిపెద్ద బతుకమ్మ, 1,354 మంది మహిళలతో నృత్యం ద్వారా రెండు గిన్నిస్ రికార్డులు సాధించి తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశామన్నారు. మిస్ వరల్డ్ వేడుకలు, గ్లోబల్ సమ్మిట్‌ల నిర్వహణతో తెలంగాణ పెట్టుబడులకే కాదు,




వ్యాపారానికి, పర్యటనకు అత్యంత 'సురక్షితమైన రాష్ట్రం' అని నిరూపించాం అన్నారు. మన పండుగలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ సంక్రాంతికి 'అతిథి దేవోభవ' అనే ఆత్మీయ సంస్కారంతో ఆతిథ్య రంగం సిద్ధంగా ఉందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవంలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కంబోడియా, థాయిలాండ్, కొరియా, జపాన్, పోర్చుగల్, వియత్నాం, మలేషియా, ఇటలీ, స్విట్జర్లాండ్, అల్జీరియా, సింగపూర్, రష్యా, ఉక్రెయిన్ / ఫ్రాన్స్ వంటి 19 దేశాలకు చెందిన 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అలాగే భారతదేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారు. రాత్రి వేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్మే 'నైట్ ఫ్లయింగ్'కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణ కానుందని అన్నారు. తెలంగాణ స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేలా రాష్ట్ర సాంప్రదాయ కళా రూపాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. వేదిక వద్ద సుమారు 100 చేనేత, హస్తకళల స్టాల్స్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రుచులతో కూడిన 60 ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్చర్ లాంగ్వేజ్ ఇండియన్ కనెక్షన్స్ సహకారంతో జరిగే ఈ ఉత్సవంలో ఇతర రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చి హైదరాబాద్ లో స్థిరపడిన వారు తమ ఇళ్లలో తయారు చేసిన 1,200 కంటే ఎక్కువ రకాల మిఠాయిలనుప్రదర్శిస్తారని అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 నుండి 18 వరకు నిర్వహించ బడుతుందన్నారు. ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన. ఉదయం పూట హైదరాబాద్ శివార్లలో, సాయంత్రం వేళ పరేడ్ గ్రౌండ్స్‌లో 'నైట్ గ్లో బెలూన్స్' ప్రదర్శన ఉంటుందన్నారు. జనవరి 16 / 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలోఅత్యాధునిక డ్రోన్లు, మల్టీ-కలర్ ఎఇడి లైట్లు, గగనతల విన్యాసాలతో ఈ షో సాగనుంది. ఇది భారతీయ సాంస్కృతిక వారసత్వం నుండి ఆధునిక ఆవిష్కరణల వరకు సాగిన ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది. హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం సర్క్యూట్‌లో పూర్తిస్థాయి హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తాయి. నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ ప్రాంతాలను ప్రపంచ స్థాయి వెడ్డింగ్ డెస్టినేషన్లుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రత్యేక సొసైటీ స్థాపన చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రత కోసం 'టూరిస్ట్ పోలీస్' అందుబాటులోకి వస్తుందన్నారు. పర్యాటకం అంటే కేవలం సందర్శన కాదు, అది ఒక అనుభూతి. అది మనల్ని మూసధోరణుల నుంచి బయటపడేలా చేసి, మానసిక వికాసానికి, ఉత్సాహానికి దోహదపడుతుంది. వారసత్వ కట్టడాల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మా ప్రభుత్వ బాధ్యత. మన పర్యాటకానికి యువత, టెక్కీలు, మీడియా, సెలబ్రిటీలు మరియు ఇన్‌ఫ్లుయెన్సర్లు రాయబారులుగా మారి... 'తెలంగాణ జరూర్ ఆనా' అంటే తెలంగాణకు తప్పక రండి అనే ఆత్మీయ పిలుపును ప్రపంచానికి చాటాలని కోరుతున్నట్లు వెల్లడించారు. పర్యాటకంపై అధికారులతో మంత్రి సమీక్షించి వివరాలు వెల్లడించారు.

# తెలంగాణ ముద్దుబిడ్డలైన ఆరుట్ల దంపతుల పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

## డాక్టర్ ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలను ప్రారంభించిన: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 07 (నమస్తే ఉదయం):**

డాక్టర్ ఆరుట్ల కమలాదేవి-రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, ఉన్నత పాఠశాలల బాల బాలికలకు ఆరుట్ల దంపతుల స్మారక క్రీడోత్సవాలకు ముఖ్యఅతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, హాజరై జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు, వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థులు నిర్వహించిన మార్చ్ పాస్ట్ లో గౌరవ వందనం స్వీకరించారు.ఎంపీ చామల మాట్లాడుతూ: తెలంగాణ ముద్దుబిడ్డలైన ఆరుట్ల దంపతుల పోరాట స్ఫూర్తిని ఈ స్మారక క్రీడల నిర్వహణ కమిటీ ద్వారా బాలబాలికల్లో క్రీడాస్ఫూర్తిని, సంఘటిత శక్తిని, ఎత్తుగడల నైపుణ్యాన్ని పెంపొందించి విజయాలను ఎలా సాధించవచ్చో తెలియజేస్తూ, ఈ మట్టిలోంచి మాణిక్యాలను వెలికితీసే మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు వారి కుటుంబ సభ్యులకు అభినందనలు , వారి ఆశయాల బాటలో మన ఆకాంక్షలు సఫలమయ్యే లక్ష్యంతో ముందుకు సాగుదామన్నారు. ఆలేరు నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోని బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని ఆరుట్ల



మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

రాంచంద్రారెడ్డి, డాక్టర్ కమలాదేవి స్మారక క్రీడల్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు కొత్త మహదేవ్ రెడ్డి, జిఎచ్ఎం జెడ్పిఎచ్ఎస్ ఆత్మకూర్ (యం) కన్వీనర్, ఆరుట్ల స్మారక క్రీడోత్సవాలు.తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి . మోత్కుపల్లి నర్సింహులు మాజీ మంత్రి.కందుల సత్యనారాయణ జిల్లా విద్యాశాఖాధికారి, యాదాద్రి భువనగిరి. పల్లా వెంకట్ రెడ్డి మాజీ శాసనసభ్యులు మునుగోడు సి.పి.ఐ. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. యానాల దామోదర్ రెడ్డి గారు, సి.పి.ఐ. పార్టీ సినీయర్ నాయకులు.ఆత్మకూరు సర్పంచ్ బీసు ధనలక్ష్మీ , ప్రజా ప్రతినిధులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నరు.



# ఉర్దూ యూనివర్సిటీలో కొత్త భవనాలు, కొత్త కోర్సులు

**హైదరాబాద్, జనవరి 7 (నమస్తే ఉదయం)**

ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇస్తియాక్ అహ్మద్ ఉర్దూ యూనివర్సిటీ కీ సంబంధించిన యూనివర్సిటీ భూమిలో భవిష్యత్తులో కొత్తగా నిర్మించబోయే భవనాల గురించి , కొత్తగా వచ్చే కోర్సుల గురించి జిల్లా కలెక్టర్ కు చాలా క్షణ్ణంగా వివరించగా జిల్లా కలెక్టర్ రంగారెడ్డి సంతృప్తి వ్యక్తం చేసి లిఖిత పూర్వకంగా వివరణ సమర్పించినట్లయితే యూనివర్సిటీకీ జారీ చేసిన నోటీసును విరమించు కోనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిసినది. ఖాళీగా ఉన్న భూమిని విద్య అభివృద్ధికి ఉపయోగించాలని కోరినట్లు తెలిసింది.

# ఐ బొమ్మ రవికి షాక్

మొదటి పేజీ తరువాయి

బుధవారం నాడు నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తాను హైదరాబాద్ వదిలి వెళ్లనని.. పోలీసు విచారణకు సహకరిస్తానని రవి కోర్టుకు తెలిపారు. ఇకపై పైరసీ చేయనని మొర పెట్టుకున్నాడు. మరోవైపు కేసు దర్యాప్తు దశలో ఉన్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. అలాగే ఇమ్మడి రవికిరవికి పలు దేశాల్లో పౌరసత్వం ఉందని.. బెయిల్ ఇస్తే విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని పోలీసులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఐబొమ్మ రవి అభ్యర్థనను తోసిపుచ్చింది. ఐదు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. ఆ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ నెల 11న లేదంటే 20న షెడ్యూల్ ప్రకటించే అవకాశా లున్నాయి. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలోగా ఎన్నికల తతంగాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది.



# పశ్చిమ దేశాల కపటత్వం

మొదటి పేజీ తరువాయి

కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

# బీసీలకు చట్టబద్ధమైన "బీసీ సబ్ ప్లాన్ తక్షణమే అమలు చేయాలి

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

## జనగామ జిల్లా కలెక్టర్ ఏఓ కు వినతి పత్రం

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు,ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి, పల్లెబోయిన అశోక్ , జిల్లా అధ్యక్షురాలు చెరుకూరి మౌనిక యాదవ్ ల సూచన మేరకు....**

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 07 (నమస్తే ఉదయం): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన "బీసీ సబ్ ప్లాన్"ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఊదరి సతీష్ ముదిరాజ్ , జిల్లా కార్యదర్శి చిర్రా వీరస్వామి, జిల్లా నాయకులతో కలిసి బుధవారం జనగామ జిల్లా కలెక్టర్ ఏఓ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు బీసీల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా మిగులు చూపడం వల్ల



బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షులు మంద దిలీప్, జిల్లా ఉపాధ్యక్షులు జిట్టబోయిన నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు, చౌప్పరి సంతోష్, పట్టణ అధ్యక్షులు, గడ్డం కృష్ణ, వివిధ మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కలకోట బాబు,శాడ నరేష్ , రాగుల ప్రశాంత్, ముక్క విష్ణువర్ధన్, ఆకుల నరసింహులు, నాయిని మహిపాల్, వల్లాల భానుచందర్, బొంకురి రమేష్, బోడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులపై వేధింపులను ఆపాలి

## గ్రామపంచాయతీ కార్మికులను, నూతనంగా ఎన్నికైన సర్పంచులు తొలగించకుండా గ్రామ పంచాయతీలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలి

## గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 07(నమస్తే ఉదయం): జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామపంచాయతీ సిబ్బందిని కక్షపూరితంగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తుందని వెంటనే సిబ్బంది పట్ల వేధింపులు ఆపాలని అక్రమంగా గ్రామపంచాయతీ కార్మికులను తొలగించకుండా గ్రామపంచాయతీలకు డిపిఓ ద్వారా ఆదేశాలు జారీ చేసేందుకు కలెక్టర్ తగు చర్యలు చేపట్టాలని, జిల్లా కేంద్రాల్లోని సిఐటియు కార్యాలయంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు నష్టం చేసే మల్టీపర్పస్ వర్కర్ విధానం జీవో 51 రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి గ్రామపంచాయతీలో చాలీచాలని వేతనాలతో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బందిని ఆన్లైన్ లో పేర్లు నమోదు చేయకుండా వేతనాలు నెలల తరబడి ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదన్నారు. గ్రామాల అవసరాల రీత్యా గ్రామ సభలలో తీర్మానం చేసి గ్రామపంచాయతీ సిబ్బంది గా నియమించుకున్న సిబ్బందిని కొన్నిచోట్ల మాకు అవసరం లేదని బాధ్యత రాహిత్యంగా సిబ్బంది




పట్ల వ్యవహరించే తీరు మానుకోవాలి అన్నారు. జిల్లాలో ఏ గ్రామంలోనైనా గ్రామపంచాయతీ సిబ్బందిని తొలగించే ప్రయత్నం చేస్తే యూనియన్ గా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఆన్లైన్లో నమోదు కాని సిబ్బందిని వెంటనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ వేతనాలను సత్వరమే చెల్లించాలని, ఆన్లైన్లో నమోదు కాని అదనపు కార్మికులకు జీపీ ల ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, డిపిఓ లను కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు.

# ప్రజలు అన్ని రంగాలలో చైతన్యం కావాలి

## సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్శిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కరుణసాగర్

బుద్వేల్, జనవరి 7 (నమస్తే ఉదయం) : ప్రజలు అన్ని రంగాలలో చైతన్యం అయి, సమాజంలో రాణించడానికి కావాల్సిన చైతన్యం పొందుకోవాలని, అందుకోసం చదువుకున్న ప్రతి ఒక్కరు కృషి చేయాలని సైఫాబాద్ లోని యూనివర్శిటీ కాలేజ్ అఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్శిటీ ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ కరుణసాగర్ అన్నారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యం లో ఏడు రోజులుగా నలభై మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో సైఫాబాద్ లోని యూనివర్శిటీ కాలేజ్ అఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్శిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కరుణసాగర్ పాల్గొని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులు, స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కు ప్రతి ఇంటి వద్ద ప్రజలు మొక్కలు నాటుకోవాలన్నారు. కాటేదాన్

పారిశ్రామిక వాడకు దగ్గరగా ఉన్న బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీ ప్రజలు తప్పకుండ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణం దెబ్బతిని, వాతావరణ కాలుష్యం ఏర్పడటం కారణంగా వాతావరణంలో అనేక మార్పులు సంబవించి పొల్యుషన్ ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్శిటీ కాలేజ్ అఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నలభై మంది విద్యార్థినీ విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రతి ఒక్కరు చదువుకోవాలని, తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని అక్షరరాస్యతపై అవగాహన కల్పిం చడంతో



మొక్కలు నాటుతున్న నాయకులు, విద్యార్థులు

పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అది జీవితాలను చిత్తు చేస్తుందని అవగాహన కల్పించామన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి దాతల సహాకారం, బస్తీ వాసుల భాగస్వామ్యం పై అవగాహన

కల్పించడం జరిగిందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని విద్యార్థులచేత సందర్శించి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, వ్యవసాయ విద్యనభ్యసిస్తే కలిగే లాభాలు గురించి చెప్పడం జరిగిందన్నారు. ఒక రోజు సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ ను పిలిపించి చట్టాల పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇలా ఇప్పటి వరకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థులు, ప్రజలలో చైతన్యాన్ని నింపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం సుగుణ, బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ శివ పవన్ రాజు, స్థానిక నాయకులు ఎ మాధవరెడ్డి, రాజు, ఎం కుమార్ యాదవ్, రంగయ్య, శశిధర్ లు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు

## రోడ్డు భద్రతా ప్రమాణాలను సామాజిక బాధ్యతగా స్వీకరించాలి

### సెషన్స్ జడ్జి ఆంజనేయులు

రాజేంద్రనగర్,జనవరి07(నమస్తే)సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలని రాజేంద్రనగర్ అదనపు సెషన్స్ జడ్జి ఆంజనేయులు తెలిపారు.జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను రాజేంద్రనగర్ కోర్టు భవనాల సముదాయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ...ద్విచక్ర వాహనాలు నడిపే అందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించుకొని వెళ్లాలన్నారు.కార్లు నడిపేవారు,అందులో ప్రయాణించే వారు సైతం తమ సీటు బెల్ట్ లను ధరించుకోవాలన్నారు.జీబ్రా క్రాసింగ్ ఉన్నచోట్ల తమ వాహనాలను నెమ్మదిగా నడిపించారన్నారు.మద్యం సేవించి వాహనాలను నడుపవద్దని, అంబులెన్స్ లకు తగిన దారిని ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రాధిక,నిష్కపాత్రుడు, నరేష్,రత్నకుమారి,న్యాయవాదులు తలారి శ్రీశైలం,సుధాకర్ రెడ్డి,జ్ఞానేశ్వర్ చారి,శ్రీనివాసులు,శ్రీధర్ రెడ్డి,షరత్ కుమార్,కృష్ణ, సుజాత,పారాలీగల్ వాలంటీర్లు సంజీవ,బాల్ రెడ్డి,కోర్టు సిబ్బంది,వెంకట రంగారెడ్డి,నరేష్ గౌడ్ ఇతరులు పాల్గొన్నారు.ం



ప్రజా సమస్యల ను తెలుసుకోవడానికి పాద యాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధన్యం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, జనవరి 7 (నమస్తే ఉదయం) మైలార్దేవుపల్లి డివిజన్ ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుండి పనిచేస్తున్నానని కార్పోరేటర్, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నేతాజీనగర్, శ్రీరాంనగర్ బసీ లలో ఆయన పార్టీ నాయకులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో కలసి పర్యటించారు. బసీ లలోనూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. వెంకటేశ్వర కాలనీలో పాడైన సీసీ రోడ్డును పరిశీలించారు. వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ ను అడిగి మంజూరైన పనులు, జరుగుతున్న పనులు, జరగాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. ఎక్కడ నాణ్యత లోపించిన సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోగి రవి, ఎన్ జగన్, శ్రీకాంత్ రెడ్డి, రామారావు, ఎ చంద్రశేఖర్, బబ్లు, పురుషోత్తంరెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, మదుసూదన్ రెడ్డి గుర్రం శంకర్, దినకర్, హారీశ్, ప్రసాద్, చెన్న బసవన్న. బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.




## బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 13న ముగ్గుల పోటీలు

రాజేంద్రనగర్,జనవరి07(నమస్తే ఉదయం)సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు తెలిపారు.రాజేంద్రనగర్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా మహిళ మోర్చా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ముఖ్యంగా సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరి 13వ తేదీ ముగ్గుల పోటీల కార్యక్రమం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షురాలు జి.పద్మావతి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి హాజరై బహుమతి ప్రధానం చేస్తారని వివరించారు.అదే విధంగా విశిష్ట అతిథిగా డాక్టర్ అమరేందర్,గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జ్ వై.శ్రీధర్ తదితరులు పాల్గొంటారన్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేయాలని కోరారు.ఈ సమావేశంలో రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి మాజీ అధ్యక్షులు జి.బాబురావు,ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి ఈ వేణుగోపాల్,కవిత,సరిత రెడ్డి,అంబిక తదితరులు పాల్గొన్నారు.



మినీ ఇటుక లారీ బోల్తా

## టైరు పేలి మినీ లారీ బోల్తా

బుద్వేల్, జనవరి 7 (నమస్తే ఉదయం): ఆరాంఘర్ నుంచి అత్తాపూర్ వైపు ఇటుక ల లోడ్ తో వెళుతున్న ఓ మినీ లారీ శివరాంపల్లి వద్ద టైరు పేలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగనప్పటికి డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బుధవారం ఉదయం పిల్లర్ నెంబర్ 289 వద్ద ఈ సంఘటన జరిగింది. ఆ సమయంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా లేకపోవడం తో పెను ప్రమాదమే తప్పిందని చెప్పవచ్చు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు సమాచారం అందించి ఎస్కవలేటరు తెప్పించి రోడ్డు పై నుంచి మినీ లారీ ని తొలగించారు. కొద్ది సమయం ట్రాఫిక్ స్థంబించిపోయింది. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు సం ఘటన కు చేరుకుని ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

## ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నరేష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 7(నమస్తే ఉదయం) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గద్వాలకు చెందిన నరేష్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏబీవీపీ గద్వాల శాఖ శంషాబాద్ లో రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరిగింది జనవరి 3.4 &5 తేదీలలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నరేష్ పటేల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినందుకు రాష్ట్ర , సంభాగ్ , విభాగ్ , జిల్లా కార్యకర్తలకి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.రాబోవు రోజుల్లో బాధ్యతాయుతంగా పనిచేసి గద్వాల జిల్లాలో ఏబీవీపీ సంస్థాగతంగా జిల్లా నలుమూలల విస్తరించే విధంగా పనిచేస్తానన్నారు.

## రాజేంద్రనగర్ జోన్‌ను సైబరాబాద్ కార్పోరేషన్‌లోనే ఉంచాలని నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

బుద్వేల్, జనవరి 7 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ జోన్ ను సైబరాబాద్ కార్పోరేషన్ లో కలుపాలని కోరుతు ఈ నెల 8వ తేదీ నుంచి ఆరాంఘర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి ఓ ప్రకటనలో తెలి పారు. గురువారం జరిగే రిలే నిరాహార దీక్షలలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొంటారన్నారు. శుక్రవారం శాసనమండలి మాజీ చైర్మన్ కె స్వామిగౌడ్, శనివారం మాజీ



మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి లు పాల్గొంటారన్నారు. రాజేంద్రనగర్ జోన్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రాంతాలను మాత్రమే కలుపాలని, ఈ ప్రాంతాన్ని హైదరాబాద్ లో కాకుండ సైబరాబాద్ కార్పోరేషన్లో ఉంచాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాద్ జిల్లాలో కలుపాలని చూస్తున్నారని, అలా కాకుండ రంగారెడ్డి జిల్లాలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర బిలు, ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

## రాజేంద్రనగర్ జోన్‌లో శంషాబాద్, మణికొండ, నార్సింగ్ ప్రాంతాలను కలపాలి : వేముల రామక్రిష్ణ

బుద్వేల్, జనవరి 7 (నమస్తే ఉదయం) : 150 డివిజన్లతో ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ను విస్తరించి 300ల డివిజన్లుగా చేసిన అధికారులు ఆశాస్త్రీయంగా జోన్లు, సర్కిళ్లు, డివిజన్లు ఏర్పాటు చేశారని, దీనిపై పునరాలోచించాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. రాజేంద్రనగర్ జోన్ లో శంషాబాద్, మణికొండ, నార్సింగ్ ప్రాంతాలను కలుపకుండ బహదూరురా, చాంద్రాయణగుట్ట, ఫలక్ నుమా ప్రాంతాలను కలుపడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైన అధికారులు ఆలోచించి రాజేంద్రనగర్ జోన్ లో శంషాబాద్, మణికొండ, నార్సింగ్ ప్రాంతాలను కలిపాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రాంతం మొదటి నుంచి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉందని. అలా చేస్తే భవిష్యత్తులో కూడా నూతనంగా ఏర్పాటు చేయనున్న సైబరాబాద్ కార్పొరేషన్ లోకి వెళుతుందన్నారు. ఇక్కడి ప్రజలు కూడా అదే కోరుకుంటున్నారని గుర్తు చేశారు. మెజారిటీ ప్రజలు, నాయకులు కోరుకుంటున్న విదంగా కాకుండ ఓ పార్టీ చెప్పుచేతల్లో ప్రభుత్వం ఉండి వారికి అనుకూలంగా డివిజన్లు, సర్కిళ్లు, జోన్లు ఏర్పాటు చేయడమే కాకుండ హైదరాబాద్ మ న్సిపల్ కార్పోరేషన్ ను వారికి దారాదత్తం చేయడానికి చూస్తున్నారన్నారు. 300 డివిజన్లతో మూడు కార్పొరేషన్ లు ఏర్పాటు చేయాలంటే ప్రతీ కార్పొరేషన్ లో 100 డివిజన్ల చొప్పున ఉండేలా చూడాలన్నారు. రాజేంద్రనగర్ జోన్ లో నుంచి పాత నగరం లో ఉన్న డివిజన్లను తీసివేసి



రాజేం ద్రనగర్ నియోజకవర్గం లో ఉన్న డివిజన్ లను కలుపాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని హైదరాబాద్ లో కలుపడం వల్ల ఇక్కడి అనేక మంది యువకులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉం దన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ప్రస్తుతం ఉన్న బుద్వేల్ లోని కార్యాలయంలోనే కొనసాగిం చాలని, ఎట్టి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లరాదన్నారు. ఈ విషయాలపై ప్రభుత్వం పునరాలోచించకపోతే తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్ శ్రీనివాస్

## మత్స్యకారుల అభివృద్ధి కోసం కృషి చేస్తా

### సర్పంచ్ శ్రీనివాస్

కొత్తకోట, జనవరి 7(నమస్తే ఉదయం) ప్రభుత్వం మత్స్యకారులకు అంద జేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తానని రామకృష్ణాపురం గ్రామం సర్పంచ్ ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామకృష్ణాపురం గ్రామంలో గల చెరువులో చేప పిల్లలను గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు మూలమల్ల యుగంధర్ రెడ్డి, మత్స్యకారుల తో కలిసి వదిలారు. ఈ కార్యక్రమంలోవిడిచే కార్యక్రమం లో గ్రామ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు .

# విద్యుత్ డిమాండ్ అనుగుణంగా మౌలిక సదుపాయాల పెంపు

### విద్యుత్ సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ చంద్రమోహన్

మెహదీపట్నం, జనవరి 7(నమస్తే ఉదయం) విద్యుత్ వినియోగదారులు వినియోగిస్తున్న డిమాండ్ కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంపొందిస్తున్నామని విద్యుత్ హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ ఎస్ ఇ టి చంద్రమోహన్ అన్నారు. బుధవారం మెహదీపట్నం డివిజన్ సూర్య నగర్ సెక్షన్ పరిధిలో గల ఆదిత్య నగర్ ప్రస్తుతం ఉన్న విద్యుత్తు సబ్ స్టేషన్ సామర్థ్యం సుమారు 2 కోట్ల రూపాయలతో ప్రస్తుతం ఉన్న 12.5 ఎం వి ఏ ట్రాన్స్ ఫార్మర్ ను 16 ఎంవిఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ గా పెంచుతూ ఏర్పాటుచేసిన పవర్ ట్రాన్స్ ఫార్మర్ ను డివిజన్ డి ఈ సుదీర్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ చంద్రమోహన్ మాట్లాడుతూ... రాబోయే వేసవిలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కు అనుకూలంగా మౌలిక సదుపాయాలు పెంపొందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అన్నారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్తు అందించాలని లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అధికారులు, సిబ్బందికి సహకరించి విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని, అదేవిధంగా తమ విద్యుత్ బిల్లును సకాలంలో చెల్లించి సంస్థ అభ్యున్నతికి తోడ్పాటు



మెహిదీపట్నం డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ లో పవర్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభోత్సవంలో ఎస్ ఈ చంద్రమోహన్, డి ఈ సుధీర్

అందించాలని కోరారు. మెహదీపట్నం డివిజనల్ ఇంజనీర్ టి సుధీర్ మాట్లాడుతూ... విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ లు బిక్కు నాయక్, సాయి మోహన్, అసిస్టెంట్ ఇంజనీర్ బాబా, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు



## మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తా : లక్ష్మారెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( చర్లపల్లి డివిజన్ ) జనవరి 07 ( నమస్తే ఉదయం ):- చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఉప్పల్ నియోజకవర్గం చర్ల పల్లి డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డి నగర్ ప్రాంతంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణానగర్ కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తానని అన్నారు. పలు ప్రాంతంలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి జరగాలన్నదే నా లక్ష్యం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాలని వాసులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు స్పీడ్ బ్రేకర్ డబ్బులతో ఏర్పాటు చేసిన మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్

## ఎర్రకుంట లంబాడి తండా రోడ్డు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

### మాజీ ఉప సర్పంచ్, రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్

బండ్లగూడ, జనవరి 7(నమస్తే ఉదయం) జిహెచ్ఎంసి కిస్మత్ పూర్ డివిజన్ ఎర్రకుంట లంబాడి తండా రోడ్డుపై కిస్మత్ పూర్ మాజీ ఉప సర్పంచ్ రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ సొంత డబ్బుతో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయించారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట లంబాడి తండా 60 గజాలు రోడ్డు, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, కిస్మత్పూర్ వివేకానంద విగ్రహం రోడ్డు పై స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాలు వేగంగా వస్తూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయాన్ని స్థానికులు మాజీ ఉప సర్పంచ్ రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ కు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తన సొంత డబ్బుతో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు స్థానికులు నీరుడు పవన్ సాయి, లక్ష్మణ్, భరత్ నాయక్, నాగిరెడ్డి , కిరణ్, ప్రేమ్ కుమార్ లక్ష్మణ్ నాయక్, గోవింద నాయక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగులో మొదటిసారి చార్జ్ సీట్ రూపొందించిన హెడ్ కానిస్టేబుల్ స్వరూపం

### అభినందించిన డిజిపి శివధర్ రెడ్డి

కానిస్టేబుల్ స్వరూపకు ప్రశంశా పత్రం అందజేస్తున్న డీజీపీ శివధర్ రెడ్డి



దుండిగల్ , జనవరి7(నమస్తే ఉదయం)తెలుగు రాష్ట్రాల పోలీస్ చరిత్ర లో హెడ్ కానిస్టేబుల్ స్వరూప నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్రం లో మొట్టమొదటి సారిగా మన మాతృభాష తెలుగు లోనే అభియోగ పత్రం ( ఛార్జ్ షీట్) దుండిగల్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న మహిళ హెడ్ కానిస్టేబుల్ స్వరూప రూపొందించారు. స్వరూప తొలిసారిగా దుండిగల్ పోలీస్ స్టేషన్ లో చార్జ్ షీట్ రూపకల్పన చేశారు.రెండు కేసులను తెలుగులో రూపొందించిన పట్ల రాష్ట్ర డిజిపి.పి శవధర్ రెడ్డి,సి.పి రమేష్ రెడ్డి , దుండిగల్ సి.ఐ సతీష్ అభినందించారు.

# పతంగి చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు: ఎస్ ఐ శ్రీనివాసులు

గద్వాల జిల్లా ప్రతినిధి (ఐజ), జనవరి 7(నమస్తే ఉదయం) ప్రాణాలకు ముప్పు తెప్పిస్తున్న పతంగి ఎగురవేయడానికి వినియోగించే చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐజ పట్టణ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ప్రజల, జంతువుల, పక్షుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిషేధిత చైనా మాంజా వినియోగం, అమ్మకాలపై జిల్లా వ్యాప్తంగా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అయిజ పట్టణంలో పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గాలి పతంగుల విక్రయానికి సంబంధించి, అయిజ పట్టణ పరిధిలోని వివిధ దుకాణాలలో అయిజ ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిషేధిత చైనా మాంజా నిల్వలు ఉన్నాయా లేదా అన్న అంశంపై ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ తనిఖీల సందర్భంగా ట్రైనింగ్ ఎస్సై కిరణ్ కుమార్ మాట్లాడుతూ... చైనా మాంజా అత్యంత ప్రమాదకరమైనదని, దీని వలన


పతంగి లు విక్రయించే దుకాణాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పిల్లలు, పశుపక్షాదులు తీవ్రంగా గాయపడటంతో పాటు ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రభుత్వం చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించిందని తెలిపారు. నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా చైనా మాంజాను అమ్మినా లేదా వినియోగించినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ వేళ ప్రజలంతా ఆనందంగా, సురక్షితంగా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని, ముఖ్యంగా పిల్లలను చైనా మాంజాకు దూరంగా ఉంచాలని పోలీసులు సూచించారు. గాలి పతంగులు ఎగరేసే సమయంలో సురక్షితమైన దారాలనే ఉపయోగించాలని కోరారు. అయిజ పట్టణంలో ఎక్కడైనా నిషేధిత చైనా మాంజా అమ్మకాలు లేదా వినియోగం జరుగుతున్నట్టు సమాచారం ఉన్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ట్రైనింగ్ ఎస్సై కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లు ఆకాష్, రవి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఓవర్ స్పీడ్ పై అవగాహన కల్పిస్తున్న ఆర్టిఏ అధికారులు

## ఓవర్ స్పీడ్‌పై స్పెషల్ డ్రైవ్ చేసిన జనగామ ఆర్టిఏ అధికారులు

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 07(నమస్తే ఉదయం): జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు లో భాగంగా బుధవారం జిల్లా లోని రఘునాథ్ పల్లి మండల కేంద్రం లోని టోల్గేట్ దగ్గర, జనగామ ఆర్టిఏ అధికారులు ఓవర్ స్పీడ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులకు పరిమితిని మించి వేగంతో వెళ్లకూడదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవిఐ మహేష్ గౌడ్, కానిస్టేబుల్ వెంకటేష్, హోంగార్డ్స్ శ్రీను, రణధీర్ ,సాంబమూర్తి, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు

### ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష

### జిల్లా ఇంచార్జి, మంత్రి, రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 07(నమస్తే ఉదయం): ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష హన్మకొండ లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం (ఐడిఓసి) లోని సమావేశ హాల్ లో బుధవారం వరంగల్ జిల్లా ఇంచార్జి, మంత్రి, రాష్ట్ర రెవిన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఇందిరమ్మ ఇళ్ల పురోగతి మీద మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా ముందంజలో ఉందని, మంజూరు అయిన ఇళ్లను త్వరగా గ్రౌండింగ్ చేయడం వల్ల రాష్ట్ర స్థాయి లో జిల్లా ప్రథమ స్థానం లో ఉందని మంత్రివర్యులకు తెలిపారు. జిల్లాలో రెండు విడతల్లో 5834 ఇళ్ళు మంజూరు కాగా, ఇప్పటివరకు 5206 ఇళ్ళు నిర్మాణ దశ లో ఉండగా, 52 ఇళ్ళు పూర్తి అయ్యాయని, 4499 మంది లబ్ధిదారులకు వివిధ దశల వారీగా డబ్బులు పడ్డాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, జిల్లా పురోగతి సాధిస్తున్న తీరు పై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


లేబర్ ఆఫీస్ నిర్మాణ పనులను పర్యవేక్షించిన జిల్లా అదనపు కలెక్టర్

## జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన జిల్లా అదనపు కలెక్టర్

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 07(నమస్తే ఉదయం): జనగాం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన లేబర్ ఆఫీస్ భవన నిర్మాణ, బతుకమ్మ కుంట తుది అభివృద్ధి పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీస్ భవన నిర్మాణ పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించారు. మిగిలిన పనులను నిర్దేశిత గడువులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే జనగాం మున్సిపాలిటీ పరిధిలోని బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల తుది దశను పరిశీలించి, పరిసరాల సుందరీకరణ, ప్రజలకు అనుకూలమైన సౌకర్యాల కల్పనపై సూచనలు చేశారు. అభివృద్ధి పనులు ప్రజల వినియోగానికి అనువుగా, దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని తెలిపారు. ప్రజల కోసం చేపట్టే మౌలిక వసతుల పనులు నాణ్యతతో పాటు సమయపాలనతో పూర్తి కావాలని ఎలాంటి లోపాలు లేకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జనగాం మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి లేబర్ ఆఫీసర్ కుమారస్వామి, మున్సిపల్ శాఖ డిఈ, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను హైదరాబాద్ కార్పొరేషన్ విలీనం చేయవద్దు

### డివిజన్ బిజెపి అధ్యక్షులు వెంకటేష్

రాజేంద్రనగర్, జనవరి 7(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిల్ లను హైదరాబాద్ కార్పొరేషన్ లో విలీనం చేయకూడదని బిజెపి అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగరపాలక సంస్థలు రాజేంద్రనగర్ జోన్ లోని రెండు సర్కిలను కలపడం వల్ల తీవ్ర ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటారని అందుకోసం ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన కోరారు. ఈ రెండు సర్కిళ్లను సైబరాబాద్ కార్పొరేషన్ లో కలపాలని బిజెపి పార్టీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ కోరారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733